క్లుప్తంగా

నల్లూరులో విజయదుర్గాంబిక జాతర

కపిలేశ్వరపురం: నల్లూరులోని శ్రీవిజయ దుర్గాంబిక అమ్మవారి తీర్థం బుధవారం ఆలయం వద్ద వైభవంగా నిర్వహించారు. హోలీ సెలవు దినం కావడంతో విద్యార్థులు అమ్మవారి సన్నిధిలో సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన ఆడ పడుచులు గ్రామానికి విచ్చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోవ వేంచేసిన నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు గురువారం జరుగుతుంది. స్థానిక ఆలయ ఆవరణలో రామచంద్రపురం దేవ స్థానం తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు ఆధ్వ ర్యంలో ఆలయంలోని హుండీలన్నింటికీ లెక్కింపు జరుగుతుందని ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు చివరిసారిగా గత ఏడాది జూన్‌లో జరిగింది.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణలో వేంచేసిన అయప్పస్వామి ఆలయ పదో వార్షికోత్సవం, స్వామిజన్మదిన వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసశర్మ బ్రహ్మత్వంలో స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. భజన కార్యక్రమం, అన్నసమారాధన నిర్వహించారు. ఆధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లాది మల్లిబాబు, కంచర్ల నారాయణరావు, గంగుమళ్ల శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సురభి గోరక్షా దీక్షా యాగం

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక పట్టాభిరామస్వామి, గణపతి, విజయదుర్గమ్మ వారి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీమహి వరాహ్ ట్రస్టు ఆధ్వర్యంలో సురభి గోరక్ష దీక్షా యాగం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందుకుర్తి మహికిరణ్ శర్మ ఆధ్వర్యంలో లక్ష గో పిడకలతో పది రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు. కిరణ్‌శర్మ మాట్లాడుతూ మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం నుంచి అఖండ జ్యోతిని తీసుకొచ్చి హోమం ప్రారంభించామని చెప్పారు. పూజల్లో సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, పీటీవీ వర్మ, పి.వీణారాణి, సమరసత సేవా సమితి ఫౌండేషన్ కన్వీనర్ పచ్చిమట్ల సీతామహాలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు పోలీసు ఉద్యోగాలు సాధించాలి

అమలాపురం టౌన్: పేద విద్యార్థులను పోలీసు ఉద్యోగార్థులుగా చేయడమే శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన పోలీస్ మాక్ టెస్ట్‌ను సత్తిబాబు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ మాక్ టెస్ట్ సందర్భంగా హాజరైన 150 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, గెద్దం ప్రదీప్, తాడికోన సర్పంచ్ సూర్య వెంకట నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో విద్యుత్ స్తంభాన్ని ఢీకున్న మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యం కోసం తరలించారు. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదని అయినవిల్లి పోలీసులు తెలిపారు.

ఆవుదూడకు శస్త్ర చికిత్స



ఆవు దూడకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యురాలు పద్మజ

ముమ్మిడివరం: ముమ్మిడివరం గాంధీ బొమ్మ సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున రోడ్డుపై పడుకున్న ఆవుదూడను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అది చూసిన స్థానిక హోటల్ వ్యాపారి ఎ.వెంకట కృష్ణ 1962కు ఫోన్ చేయడంతో వైఎస్సార్ సంచార వైద్య అంబులెన్స్ హుటాహుటీన అక్కడకు చేరుకుంది. అంబులెన్స్ వైద్యురాలు సీహెచ్ పద్మజ ఆవుదూడకు అత్యవసర చికిత్స అందించారు. దూడ స్పృహలోకి రావడంతో దాన్ని అంబులెన్స్‌లో యజమాని ఇంటికి తరలించి అక్కడ శస్త్రచికిత్స చేశారు.

అర్తమూరు రోడ్డుకు మహర్దశ

- ఒకటిన్నర దశాబ్దాల తర్వాత పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



అర్తమూరులో రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయ భాస్కరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: దాదాపు దశాబ్దంన్నర కాలం తర్వాత మండలంలోని అర్తమూరు రోడ్డు అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. అధ్వానంగా తయారైన ఈ రోడ్డుతో ఏళ్ల తరబడి పడుతున్న వెతలకు తెరనున్నాయి. శరవేగంగా రహదారి పనులు జరుగుతుండడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్తమూరు గ్రామ ప్రజలు రాజమహేంద్రవరం, ద్వారపూడి వైపు వెళ్లాలన్న, ఇప్పనపాడు, తాపేశ్వరం, పాలతోడు, వెలగతోడు తదితర గ్రామాల ప్రజలు అర్తమూరు, అనపర్తి మండలం రామవరం తదితర గ్రామాలు వెళ్లేందుకు తాపేశ్వరం–అర్తమూరు–లొల్ల రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలి. తాపేశ్వరం తూము వద్ద నుంచి రామవరం తూము వరకు 5.5 కిలోమీటర్లు పొడవు కలిగిన ఈ రోడ్డును గతంలో మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి హయాంలో ఒకసారి, దశాబ్దంన్నర కాలం క్రితం మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి హయాంలో పూర్తిస్థాయిలో రోడ్డు అభివృద్ధి పనులు జరిగాయి. తర్వాత అప్పుడప్పుడు మరమ్మతులు మినహా పూర్తిస్థాయిలో రోడ్డు అభివృద్ధి జరిగింది లేదని మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు మండ నాగిరెడ్డి తెలిపారు. అనతి కాలంలో మరమ్మతులు దెబ్బతిని రోడ్డు దారుణంగా తయారయ్యేది. ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులతో ప్రమాదభరితంగా ఉన్న ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చేది. వర్షం వచ్చినప్పుడు, రాత్రి సమయాల్లో గోతులు కనిపించక వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాలు పాలయ్యేవారు. గ్రామీణ రోడ్లు అభివృద్ధిలో భాగంగా తాపేశ్వరం తూము వద్ద నుంచి అర్తమూరు మీదుగా రామవరం వరకు పూర్తిస్థాయిలో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు స్పెషల్ గ్రాంటు నుంచి సుమారు రూ.90 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే పెద్దపెద్ద గోతులకు మరమ్మతులు చేసి, గత నాలుగు రోజులుగా బీటీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీర్ఘకాలం తర్వాత రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తుండటంపై గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

రోడ్డు అభివృద్ధి పనులను బుధవారం గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు, పార్టీ నాయకులు పరిశీలించారు. పనుల ప్రగతిపై ఆర్అండ్‌బీ ఏఈ పి.రాంబాబుతో మాట్లాడారు. దీర్ఘకాలం మన్నే విధంగా పూర్తి నాణ్యతతో రోడ్డు నిర్మాణం చేయాలని సర్పంచ్ అన్నపూర్ణ ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. అనంతరం అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు మాట్లాడుతూ రోడ్డు సమస్యతో ఏళ్ల తరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వైఎస్సార్ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, పార్టీ నాయకులు చిర్ల శ్రీరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్ రెడ్డి, తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రాంబాబు, కొవ్వూరి నాగిరెడ్డి, మండ వెంకటరెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, తాడి రామారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, తేతలి హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరునికి పూజలు



వేంకటేశ్వరునికి అష్టదళపాదపద్మారాధన నిర్వహిస్తున్న వేదపండితులు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదోరోజు బుధవారం స్వామికి అష్టదళ పాద పద్మారాధన వైభవంగా నిర్వహించారు. తొలుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని తిరుచ్చి వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

వినాయక ఆలయానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని గోపాలపురం కొత్త కాలనీ వద్ద నూతనంగా నిర్మించనున్న శ్రీ వర సిద్ధి వినాయక స్వామి ఆలయానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.

మహిళా చైతన్యం.. సామాజిక ప్రగతికి సోపానం



కపిలేశ్వరపురంలో వైద్యాధికారి రత్నకుమారిని సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్ సాకా శ్రీనివాస్

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో మహిళా చైతన్యం సామాజిక ప్రగతికి సోపానమని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురం సచివాలయంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, డాక్టర్ పి.రత్నకుమారిలను ఘనంగా సత్కరించారు. అంగర పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా వైద్యులు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంకలను సత్కరించారు. 19 గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాల్లోని మహిళా ఉద్యోగులు, వలంటీర్లకు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ సత్యవేణి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి అనేక అవకాశాలను కల్పిస్తుందన్నారు. విద్యార్థినులంతా చొరవతో చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడటం ద్వారా మహిళా వివక్ష అంతం కాగలదని వైద్యాధికారులు రత్నకుమారి, అనూజ ప్రియాంక అన్నారు.

స్త్రీల గౌరవంలో దేశం ప్రపంచానికే తలమానికం

కాజులూరు: ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఈ విధానంలో భారతదేశం ప్రపంచ దేశాలకే తలమానికంగా నిలిచిందని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ గొల్లపాలెం క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో క్లబ్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో భువనేశ్వరిదేవి పాల్గొని పలువరు పేద మహిళలకు చెప్పులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు పురుషులతో పాటు సమానంగా ముందడుగు వేయాలన్నారు. అదే విధంగా దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో స్థానిక మాజీ సర్పంచ్ పెంకే భీమశంకరప్రసాద్, అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు పాల్గొని మహిళా వైద్యులు, సిబ్బందిని శాలువలతో సత్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ కొప్పిశెట్టి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవిని ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల్లోను, ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లోను మహిళా దినోత్సవం నిర్వహించారు.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, నాయకులు అనంతలక్ష్మి, విమల, సందీప్, శ్రీజ శిరీష, శైలు తదితరుల ఆధ్వర్యంలోను, రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలోను, పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

పామర్రులో..

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పామర్రు బీసీ కాలనీలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ వెంకట దుర్గ ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. అనంతరం స్వీట్లు పంచుకుని ఒకరికొకరు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, గ్రామ పెద్దలు కుడిపూడి శ్రీనివాస్, వాసంశెట్టి సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్‌బాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవిని సత్కరిస్తున్న మహిళలు



పామర్రులో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్న మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

అమలాపురం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు అందించి చేయుతనిస్తుందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ అన్నారు. బండారులంకలో విజయదుర్గ మహిళా శక్తి సంఘం నిర్వహిస్తున్న జ్యూస్ కూల్‌డ్రింక్ సంస్థలో నూతనంగా కొనుగోలు చేసిన తయారీ యంత్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జ్యూస్ కూల్‌డ్రింక్ సంస్థకు హైరాడార్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకంలో భాగంగా మంజూరైన రూ.10 లక్షల రుణంతో యంత్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ యంత్రాలను ప్రారంభించి కూల్‌డ్రింక్ తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్.లక్ష్మీనారాయణ, హార్టికల్చర్ జేడీ మల్లికార్జున్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో బుధవారం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అలాగే నామకరణలు, అన్నప్రాశనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

11 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో చైర్‌పర్సన్ దుర్గారాణి, శ్రీదేవి తదితరులు

మండపేట: స్థానిక వెశ్యా లేడీస్ వెల్ఫేర్ అసోసియేషన్, అమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నాళం వారి సత్రంలో జరిగిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షురాలు వారనాశి శ్రీదేవి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె సందర్శించారు. శిబిరంలో 110 మంది రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. శిబిరాన్ని పారిశ్రామిక వేత్త కాళ్లకూరి గొల్లబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ సందర్శించి నిర్వాహకులను ప్రశంసించారు. అసోసియేషన్ సభ్యులు కాళ్లకూరి దుర్గాప్రసన్న, జయశ్రీ, శ్రీలక్ష్మి, కె.శాంతి, చక్కా వల్లీ, సి.దేవి తదితరులు పాల్గొన్నారు.

చైతన్య ప్రభు ఆవిర్భావ మహోత్సవం

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో బుధవారం శ్రీచైతన్యమహాప్రభు ఆవిర్భావ మహోత్సవాన్ని శ్రీనివాస ప్రభుజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మహాహారతి, పుష్పాభిషేకం, సంకీర్తనలు, ప్రవచనం, మహాప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ చేయూత

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం రాయివారిపేటకు చెందిన గూనపాటి వెంకటేశ్వరరావు(36) కొద్దిరోజుల కితం ఆకస్మికంగా మృతి చెందాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. వీరికి స్వామి వివేకానంద సేవా సమితి, 4వ వార్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు(బాబి) అభ్యర్థన మేరకు ఉప్పలగుప్తం మండలానికి చెందిన హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ 1500 విలువైన నిత్యావసరాలు అందజేశారు. ఈ సంస్థను గంగుమళ్ల శ్రీనివాస్ అభినందించారు.

ఉత్సాహంగా హోలీ



పసలపూడిలో హోలీ సంబరాల్లో చిన్నారులు

రాయవరం: మండల గ్రామాల్లో హోలీ వేడుకలను ఉత్సాహంగా జరిగాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందాన్ని గడిపారు. ముఖ్యంగా యువతీ యువకులు రంగులనే కాకుండా టమాటాలు కూడా విసురుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ హోలీ సంబరాల్లో తేలియాడారు.



గొల్లపాలెంలో రంగులు చల్లుకుంటూ హోలీ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

కాజులూరులో..

కాజులూరు: హోలీ పండుగ కార్యక్రమాలను బుధవారం కాజులూరు మండల గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా అంతా ఒక చోట చేరి హోలీ ఆడారు. పలు ప్రాధాన కూడళ్లలో మహిళలు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

135 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 135 మద్యం సీసాలతో బొమ్మిడి తాతారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు స్టేషన్ సీఐ జేవీ భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ డి.శ్రీనివాసరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమర్ అలీషాను దర్శించుకున్న భక్తులు

అమలాపురం టౌన్: పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా బుధవారం సాయంత్రం అమలాపురం పట్టణం కొంకాపల్లిలోని ఓ భక్తుడి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఉమర్ అలీషాను అనేక మంది భక్తులు దర్శించుకుని ఆయన ఆశీస్సులు అందుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సూదా గణపతి తదితరులు దర్శించుకున్నారు.

పార్టీ బలోపేతానికి గృహసారథులు కృషి చేయాలి



కాజులూరులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న కమిటీ పరిశీలకుడు లక్ష్మణ్



సమావేశంలో కన్వీనర్లు, గృహసారథులకు సూచనలిస్తున్న శ్యామ్

కాజులూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం కావటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని కె.గంగవరం మండలం దంగేరు ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు గృహసారథుల కమిటీ పరిశీలకుడిగా నియమితులైన లక్ష్మణ్ కొత్తగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కాజులూరు సచివాలయం-3లో బుధవారం సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకునేందుకు సీఎం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులలో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదన్నారు. సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజని, మండల గృహసారథుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సచివాలయ కన్వీనర్లు తలాటం వీరన్న, టేకుమూడి శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్, యాళ్ల సత్తిబాబు, రెడ్డి నాగేశ్వర్రావు, రేకాడి ఆదినారాయణ, మేడిశెట్టి సూరిబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.

అముజూరులో..

కె.గంగవరం: సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు సమష్టి కృషితో పని చేసి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, సచివాలయ పరిశీలకుడు వాసంశెట్టి శ్యామ్ అన్నారు. మండలంలోని అముజూరు సచివాలయం వద్ద బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు, కన్వీనర్లు పని చేయాలని తెలిపారు. బూత్ స్థాయిలో ఉండే ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చేసిన పనులను గూర్చి ప్రజలకు సవివరంగా తెలియజేయాలన్నారు. వలంటీర్లతో గృహసారథులు, కన్వీనర్లు భాగస్వామ్యులై ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, సర్పంచ్ నానారపు కళ్యాణి, గ్రామ పెద్దలు పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జన్మదిన వేడుకలు



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద ఉన్న సీతారామ క్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు, మల్లిపూడి వెంకటేశ్వరరావు, సాయిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివానందస్వామి, వరదాచార్యులు పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కొనగళ్ల సత్యనారాయణ, పసల కొండ, యరమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.